# భళా బిష్ణోయ్

## టీ20ల్లో టాప్ ర్యాంక్‌లోకి

**రవి బిష్ణోయ్..భారత క్రికెట్ తురుపుముక్క! తన లెగ్‌స్పిన్ నైపుణ్యంతో వికెట్ల వేట కొనసాగిస్తున్న క్రికెటర్. అనతికాలంలోనే అందరి మన్ననలు అందుకున్నాడు. ఇటీవల ఆస్ట్రేలియాతో సిరీస్‌లో అద్భుత ప్రదర్శన కనబరిచిన ఈ రాజస్థాన్ చిన్నోడు ఇప్పుడు సఫారీ పర్యటనకు సై అంటున్నాడు.అవకాశాలను అందిపుచ్చుకుంటూ ప్రత్యర్థి బ్యాటర్ల భరతం పడుతూ భారత భవిష్యత్ ఆశాకిరణంగా కనిపిస్తున్నాడు. వెస్టిండీస్, అమెరికా వేదికలుగా జరిగే ప్రతిష్ఠాత్మక టీ20 ప్రపంచకప్‌లో జాతీయజట్టులో చోటు దక్కించుకోవడమే లక్ష్యంగా అడుగులు వేస్తున్న బిష్ణోయ్‌పై ప్రత్యేక కథనం.**

నమస్తే తెలంగాణ క్రీడావిభాగం

రవి బిష్ణోయ్ వికెట్ల వేట దిగ్విజయంగా కొనసాగిస్తున్నాడు. టీ20 ఫార్మాట్ నుంచి సీనియర్ బౌలర్ యజువేంద్ర చాహల్‌ను తప్పిస్తూ ఆస్ట్రేలియాతో సిరీస్‌కు రవి బిష్ణోయ్‌కు అవకాశమిచ్చారు. ఇదే అదనుగా చెలరేగిన బిష్ణోయ్..ఆసీస్ బ్యాటర్లను కంగారెత్తించాడు. సొంతగడ్డపై పరిస్థితులను తనకు అనుకూలంగా మలుచుకుంటూ ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో తొమ్మిది వికెట్లతో 'మ్యాన్ ఆఫ్ ద సిరీస్'గా నిలిచాడు. ఓవైపు లెఫ్టార్మ్ స్పిన్నర్ అక్షర్ పటేల్ ఆసీస్ బ్యాటర్లను ఇబ్బంది పెడితే మరో ఎండ్‌లో తన వైవిధ్యమైన స్పిన్‌తో బిష్ణోయ్ ముప్పుతిప్పలు పెట్టి మూడు చెరువుల నీళ్లు తాగించాడు. 7.14 ఎకానమీ కొనసాగిస్తూ వికెట్లు ఖాతాలో వేసుకున్నాడు. గతేడాది ఫిబ్రవరిలో భారత్ తరపున అంతర్జాతీయ టీ20ల్లో అరంగేట్రం చేసిన ఈ 23 ఏండ్ల యువ స్పిన్నర్ ఇప్పటి వరకు 21 మ్యాచ్‌ల్లో 34 వికెట్లు పడగొట్టాడు. 17.38 సగటుతో అత్యుత్తమ ప్రదర్శన(4/16) కనబరిచాడు. చురుకైన వేగానికి వైవిధ్యాన్ని జోడిస్తూ బిష్ణోయ్ సంధించే బంతులకు ప్రత్యర్థి బ్యాటర్ల నుంచి సమాధానం కరువవుతున్నది.

### వైవిధ్యాన్ని కొనసాగిస్తూ

తీవ్ర పోటీ ఉండే టీమ్‌ఇండియాలో చోటు నిలుపుకోవడం ఎవరికైనా కత్తి మీదసామే. అలాంటిది వచ్చిన అవకాశాన్ని అనుకూలంగా మలుచుకోవడం కూడా నేర్పుతో అలవర్చుకోవాలి. అది రవి బిష్ణోయ్ తొందరగానే అలవాటు చేసుకున్నాడు. జట్టులోకి వచ్చిన ఏడాది లోపే కీలక బౌలర్‌గా ఎదిగాడు. అవకాశాలు లేనప్పుడు కుంగిపోవడం, వచ్చినప్పుడు వృథా చేసుకోకుండా జాగ్రత్తగా వ్యవహరించడం బిష్ణోయ్‌కి కలిసి వచ్చిందని చెప్పాలి. అఫ్గానిస్థాన్ స్టార్ స్పిన్నర్ రషీద్‌ఖాన్ బౌలింగ్ శైలిని ఒకింత పోలి ఉండే బిష్ణోయ్ ఓవర్‌లో ప్రతీ బంతిని ఒక్కో రకంగా వేయడంలో దిట్ట. బంతిని వేగంగా స్పిన్ చేయడంలోనే కాదు గూగ్లీ, ఫ్లిప్పర్‌లు వేస్తూ బ్యాటర్లను బోల్తా కొట్టించడంలోనూ ఆరితేరాడు. ఆసీస్‌తో జరిగిన టీ20 సిరీస్‌లో 3/32, 2/32, 2/29, 1/17, 1/54 ఇలా ప్రతీ మ్యాచ్‌లోనూ వికెట్లు తీసి జట్టు విజయాల్లో భాగమయ్యాడు.

### టీ20ల్లో నంబర్‌వన్

ఆసీస్‌పై అద్భుత ప్రదర్శనతో ఆకట్టుకున్న బిష్ణోయ్..తాజా టీ20 ర్యాంకింగ్స్‌లో నంబర్‌వన్ ర్యాంక్‌లో నిలిచాడు. 699 పాయింట్లతో అఫ్గానిస్థాన్ స్పిన్నర్ రషీద్‌ఖాన్‌ను రెండో ర్యాంక్‌కు నెడుతూ అగ్రస్థానాన్ని అధిష్ఠించాడు. పొట్టి ఫార్మాట్‌లో టాప్ ర్యాంక్‌కు చేరుకోవడానికి రవి తీవ్రంగా చెమటోడ్చాడు. ఈ క్రమంలో లంక దిగ్గజ స్పిన్నర్ ముత్తయ్య మురళీధరన్ చేత శభాష్ అనిపించుకున్నాడు. 'భారత్ ప్రతీసారి దిగ్గజ స్పిన్నర్లను ప్రపంచ క్రికెట్‌కు పరిచయం చేసింది. అనిల్‌కుంబ్లే, రవిచంద్రన్ అశ్విన్ లాంటి స్పిన్నర్లు క్రికెట్‌ను శాసించారు. లెగ్ స్పిన్నర్లలో బిష్ణోయ్ చాలా వైవిధ్యంతో ఉన్నాడు. బంతిని వేగంగా వేయడానికి తోడు ఊరించే విధంగా సంధిస్తాడు' అని అన్నాడు.

### 2019 అండర్-19 ప్రపంచకప్‌తో

సరిగ్గా మూడేండ్ల క్రితం జరిగిన అండర్-19 ప్రపంచకప్ ద్వారా బిష్ణోయ్ వెలుగులోకి వచ్చాడు. భారత్ రన్నరప్‌గా నిలిచిన మెగాటోర్నీలో బిష్ణోయ్ 17 వికెట్లతో టాపర్‌గా నిలిచాడు. ఈ క్రమంలో పియూశ్ చావ్లా(2006), సందీప్‌శర్మ(2012) సరసన నిలిచాడు.

### మెగాటోర్నీ లక్ష్యంగా

వచ్చే ఏడాది వెస్టిండీస్, అమెరికా వేదికలుగా జరిగే టీ20 ప్రపంచకప్‌లో టీమ్‌ఇండియాలో చోటు దక్కించుకోవడమే లక్ష్యంగా బిష్ణోయ్ ముందుకు సాగుతున్నాడు. ఈ నెల 9నుంచి దక్షిణాఫ్రికాతో మొదలుకానున్న టీ20 సిరీస్‌లో టీమ్‌ఇండియాకు ఎంపికయ్యాడు. ఆ తర్వాత జనవరిలో అఫ్గానిస్థాన్‌తో సిరీస్, ఐపీఎల్ తర్వాత మెగాటోర్నీ నాటికి భారత్ ఆరు మ్యాచ్‌లు ఆడనుంది. ఈ క్రమంలో మెరుగైన ప్రదర్శనతో బెర్తు దక్కించుకునేందుకు బిష్ణోయ్ పట్టుదలతో ఉన్నాడు. ఈ రాజస్థాన్ చిన్నోడు..మెగాటోర్నీ టిక్కెట్ దక్కించుకోవాలని అభిమానులందరం ఆశిద్దాం.

## టీ20 ప్రపంచకప్ లోగో ఆవిష్కరణ

దుబాయ్ : వచ్చే యేడాది జరుగనున్న టీ20 ప్రపంచకప్‌కోసం రూపొందించిన సరికొత్త లోగోను ఐసీసీ గురువారం ఆవిష్కరించింది. వచ్చే యేడాది పురుషుల, మహిళల టీ20 ప్రపంచకప్ టోర్నీలను నిర్వహించనున్నారు. పురుషుల ప్రపంచకప్ వెస్టిండీస్, అమెరికా సంయుక్తంగా నిర్వహించనుండగా, మహిళల ప్రపంచకప్‌ను బంగ్లాదేశ్ నిర్వహించనున్నది. బ్యాట్, బంతి, ఎనర్జీలను ప్రతిబింబించేలా లోగోను రూపొందించారు. అంతేగాక నిర్వాహక దేశాల పేర్లనుకూడా పొందుపరిచారు. బ్యాట్, బంతితోపాటు ఎనర్జీని గుర్తుచేసేలా రూపొందించిన లోగో అభిమానులను అలరింస్తుందని ఐసీసీ జనరల్ మేనేజర్(మార్కెటింగ్ అండ్ కమ్యూనికేషన్స్) క్లెయిర్ ఫర్లాంగ్ తెలిపారు.

## ఇంగ్లండ్‌దే రెండో వన్డే

ఆంటిగ్వా : మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో వెస్టిండీస్‌తో జరిగిన రెండో వన్డేలో ఇంగ్లండ్ 6 వికెట్ల తేడాతో గెలుపొంది సిరీస్ స్కోరు 1-1గా సమం చేసింది. దీనితో సిరీస్ ఫలితం కోసం ఇరు జట్లు శనివారం బార్బడోస్‌లో మూడో వన్డేలో తలపడతాయి. తొలుత బ్యాటింగ్ చేసిన వెస్టిండీస్ 39.4 ఓవర్లలో 202 పరుగులకు ఆలౌటయింది. షాయ్ హోప్(68), షెర్ఫానె రూదర్‌ఫర్డ్(63) అర్ధ సెంచరీలతో రాణించారు. శామ్ కరన్, లివింగ్‌స్టోన్ చెరి మూడు, గస్ అట్కిన్సన్, రెహాన్ అహ్మద్ రెండేసి వికెట్లు పడగొట్టారు. అనంతరం ఇంగ్లండ్ 32.5 ఓవర్లలో 4 వికెట్లకు 206 పరుగులు చేసి గెలుపొందింది. ఓపెనర్ విల్ జాక్స్(73), జోస్ బట్లర్(58నాటౌట్) అర్ధసెంచరీలతో జట్టును గెలిపించారు. గుడకేష్ మోతీ 2 వికెట్లు పడగొట్టాడు.

## బింద్యారాణికి నిరాశ

దోహా : ఐడబ్ల్యూఎఫ్ గ్రాండ్ ప్రి వెయిట్‌లిఫ్టింగ్ పోటీలలో భారత్ కు చెందిన కామన్వెల్త్ క్రీడల రజత పతక విజేత బింద్యారాణి దేవి క్లీన్ అండ్ జర్క్ విభాగంలో బరువునెత్తడంలో విఫలమయింది. 55కి. విభాగంలో తలపడిన బింద్యారాణి మూడు ప్రయత్నాలలో ఏ ఒక్కదానిలో సఫలం కాలేకపోయింది. దీనితో ఆమె ప్రదర్శనను పరిగణనలోకి తీసుకోలేదు. స్నాచ్‌లో మాత్రమే బింద్యారాణి రెండుసార్లు బరువును ఎత్తగలిగింది. 106 కిలోల బరువు ఎత్తేందుకు ప్రయత్నించి విఫలమైన బింద్యారాణి మరో రెండుసార్లు 109 కిలోలను ఎత్తేందుకు ప్రయత్నించినా ఫలితం లేకపోయింది.

## శ్రీశాంత్ ఫిక్సర్: గంభీర్



సూరత్ : లెజెండ్స్ లీగ్ క్రికెట్ మ్యాచ్ సందర్భంగా గౌతమ్ గంభీర్ తనను ఫిక్సర్ అని నిందించాడని టీమ్ ఇండియా మాజీ పేసర్ శ్రీశాంత్ ఆరోపించాడు. బుధవారం ఇండియన్ కేపిటల్స్-గుజరాత్ జెయింట్స్ మ్యాచ్ సందర్భంగా ఈ సంఘటన జరిగినట్టు తెలిపాడు. వారిరువురూ ఒకరినొకరు దూషించుకుంటూ వివాదానికి దిగడంతో అంపైర్లు జోక్యం చేసుకోవాల్సి వచ్చింది. గంభీర్ తనను ఫిక్సర్ అని దూషించగా, అతని మద్దతు దారులు గంభీర్ సిక్సర్ అన్నట్టు మాట మారుస్తున్నారన్నాడు. గంభీర్ గతంలో ఐపీఎల్ మ్యాచ్ సందర్భంగా కోహ్లీతోనూ గొడవపడిన విషయాన్ని శ్రీశాంత్ గుర్తుచేశాడు.

## సన్‌రైజర్స్‌లోకి రచిన్!

హైదరాబాద్: ఐపీఎల్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ టీమ్‌లోకి న్యూజిలాండ్ యువ ఆల్‌రౌండర్ రచిన్ రవీంద్ర వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈ నెల 19న దుబాయ్ వేదికగా జరుగనున్న ఐపీఎల్ వేలంలో రచిన్‌కు భారీ ధర పలికే చాన్స్ ఉంది. ఇటీవల భారత్‌లో జరిగిన వన్డే ప్రపంచకప్‌లో రచిన్ అంచనాలకు మించి రాణించాడు. ఓపెనర్‌గా 578 పరుగులతో మెగాటోర్నీలో కివీస్ టాప్ స్కోరర్‌గా నిలిచాడు. ఈ నేపథ్యంలో రచిన్ కోసం..సన్‌రైజర్స్ ప్రయత్నం చేసే అవకాశముందని మాజీ క్రికెటర్ ఇర్ఫాన్ పఠాన్ చెప్పుకొచ్చాడు. మొత్తానికి ఐపీఎల్ వేలంలో ఈ కివీస్ ఆల్‌రౌండర్ కండ్లు చెదిరే ధరకు అమ్ముడుపోవడం ఖాయంగా కనిపిస్తున్నది.

## 'ప్లేయర్ ఆఫ్ ది మంత్' రేస్‌లో షమీ

దుబాయ్ : నవంబర్ నెలకు ప్లేయర్ ఆఫ్ ది మంత్ అవార్డుకు ఐసీసీ నామినేట్ చేసినవారిలో భారత పేసర్ మహ్మద్ షమీ పేరును జోడించారు. ఇటీవల ఇండియా నిర్వహించిన వన్డే ప్రపంచకప్‌లో విశేష ప్రతిభ కనబరిచిన షమి, ఆస్ట్రేలియా ఆటగాళ్లు గ్లెన్ మాక్స్‌వెల్, ట్రావిస్ హెడ్ పేర్లను ఐసీసీ ఈ అవార్డుకు నామినేట్ చేసింది. కాగా మహిళా విభాగంలో ఇద్దరు బంగ్లా క్రీడాకారిణులు, ఒక పాకిస్తాన్ క్రీడాకారిణి పేర్లు నామినేట్ అయ్యాయి. ఆ రెండు జట్ల మధ్య జరిగిన సిరీస్‌లో బంగ్లా ప్లేయర్లలో బంతితో చెలరేగిన నహీదా అక్తర్, బ్యాట్‌తో రాణించిన ఫర్జానా హక్, పాకిస్థాన్ బౌలర్ సాదియా ఇక్బాల్ ప్లేయర్ ఆఫ్ ది మంత్ అవార్డుకు నామినేట్ అయ్యారు.

## బెంగాల్, జైపూర్ మ్యాచ్ టై

అహ్మదాబాద్ : ప్రొ కబడ్డీ లీగ్‌లో గురువారం బెంగాల్ వారియర్స్, జైపూర్ పింక్ పాంథర్స్ మధ్య జరిగిన పోరు వీక్షకులకు మజా అందించింది. హోరాహోరీ పోరులో ఇరు జట్లు సమఉజ్జీలుగా నిలిచాయి. నువ్వానేనా అన్నట్టు సాగిన పోరాటంలో ఇరు జట్లు సమంగా 28 పాయింట్లు సాధించడంతో మ్యాచ్ టైగా ముగిసింది. బెంగాల్ జట్టులో శ్రీకాంత్ 7, నితిన్ 5, మనిందర్ 4 పాయింట్లు సాధించారు. కాగా జైపూర్ జట్టులో సబ్‌స్టిట్యూట్ ఆటగాడు భవానీ రాజ్‌పుత్ 10 పాయింట్లతో రాణించగా, అర్జున్ 6, అంకుష్ 4 పాయింట్లతో సహకరించారు. మరో మ్యాచ్‌లో పట్నా పైరేట్స్ 33-30 స్కోరుతో గుజరాత్ జెయింట్స్‌పై గెలుపొందింది.

## ఎస్‌డీఎఫ్‌సీ, రియల్ కశ్మీర్ పోరు డ్రా

హైదరాబాద్, ఆట ప్రతినిధి: ఐలీగ్‌లో భాగంగా శ్రీనిధి దక్కన్ ఫుట్‌బాల్ క్లబ్(ఎస్‌డీఎఫ్‌సీ), రియల్ కశ్మీర్ జట్ల మధ్య జరిగిన పోరు ఎలాంటి గోల్ లేకుండానే డ్రాగా ముగిసింది. గురువారం టీఆర్‌సీ స్టేడియంలో జరిగిన మ్యాచ్‌లో ఎస్‌డీఎఫ్‌సీ, రియల్ కశ్మీర్ జట్లు హోరాహోరీగా తలపడ్డాయి. ఈ మ్యాచ్‌లో నాలుగు మార్పులతో బరిలోకి దిగిన ఎస్‌డీఎఫ్‌సీ అనుకున్న ఫలితాన్ని సాధించలేకపోయింది. పోరు మొదలైన ఐదో నిమిషంలోనే గోల్ చేసే అవకాశం వచ్చినా ఎస్‌డీఎఫ్‌సీ సద్వినియోగం చేసుకోలేకపోయింది. వరుస విజయాలతో జోరుమీదున్న శ్రీనిధి ఎఫ్‌సీ ఈ నెల 11న ఢిల్లీ ఫుట్‌బాల్ క్లబ్‌తో తలపడుతుంది.

వాణిజ్య

## హ్యుందాయ్ వాహన ధరల పెంపు

న్యూఢిల్లీ, డిసెంబర్ 7: వాహన ధరల పెంపు జాబితాలోకి తాజాగా హ్యుందాయ్ కూడా చేరింది. వచ్చే నెల నుంచి అన్ని రకాల వాహన ధరలను పెంచుతున్నట్టు తాజాగా ప్రకటించింది. ఉత్పత్తి వ్యయం అధికమవడం, ఎక్స్ఛేంజ్ రేట్లలో మార్పులు, కమోడిటీ ఉత్పత్తుల ధరలు పెరగడం వల్ల వాహన ధరలను పెంచకతప్పడం లేదని కంపెనీ సీవోవో తరుణ్ గార్గ్ తెలిపారు. జనవరి 1 నుంచి అమలులోకి రానున్న ఈ ధరలు ఎంత శాతం మేర పెంచుతున్న విషయాన్ని ఆయన వెల్లడించలేదు. ప్రస్తుతం సంస్థ రూ.5.84 లక్షల గ్రాండ్ ఐ10 నియోస్ మొదలుకొని రూ.45.95 లక్షల విలువైన ఎలక్ట్రిక్ ఎస్‌యూవీ అయోనిక్5ను దేశీయంగా విక్రయిస్తున్నది. ఇప్పటికే మారుతి, టాటా మోటర్స్, మహీంద్రా, హోండా, ఆడీలు వాహన ధరలను పెంచుతున్నట్టు ప్రకటించాయి.

### డుకాటీ కూడా..

ఇటలీకి చెందిన సూపర్‌బైకుల తయారీ సంస్థ డుకాటీ.. ఎంపిక చేసిన మాడళ్ల ధరలను వచ్చే నెల నుంచి పెంచుతున్నట్టు ప్రకటించింది. నిర్వహణ వ్యయం అధికమవడం, ఉత్పత్తికయ్యే ఖర్చులు కూడా పెరగడం వల్లనే ధరలు సవరించాల్సి వచ్చిందని డుకాటీ ఇండియా ఎండీ బిపుల్ చంద్ర తెలిపారు.

## ఆజియో బిగ్ బోల్డ్ సేల్

బెంగళూరు, డిసెంబర్ 7: ఆన్‌లైన్లో దుస్తులను విక్రయిస్తున్న ఆజియో తాజాగా 'బిగ్ బోల్డ్ సేల్'ను ప్రకటించింది. ఈ ఆఫర్ కింద 50 శాతం నుంచి 90 శాతం వరకు రాయితీ ఇస్తున్నట్లు తెలిపింది. 19 వేలకు పైగా పిన్‌కోడ్‌లో ఉన్న కస్టమర్లు 5,500కి పైగా బ్రాండ్లకు సంబంధించిన ఉత్పత్తులను ఆన్‌లైన్లో బుకింగ్ చేసుకోవచ్చునని సూచించింది. ఈ ఆఫర్లలో భాగంగా బుకింగ్ చేసుకున్నవారికి ప్రతి ఎనిమిది గంటలకొకసారి ఐఫోన్ 14 ప్రొ, యాపిల్ మ్యాక్‌బుక్ ఎయిర్, సామ్‌సంగ్ గెలాక్సీ ఫోల్డ్ 4, సామ్‌సంగ్ ఎస్23 అల్ట్రాను గెలుచుకోవచ్చునని కంపెనీ సీఈవో వినీత్ నాయర్ తెలిపారు.

## వరుస ర్యాలీకి బ్రేక్



ముంబై, డిసెంబర్ 7: వరుసగా ఏడు రోజులపాటు జరిగిన మార్కెట్ ర్యాలీకి గురువారం బ్రేక్‌పడింది. ఇన్వెస్టర్లు లాభాల స్వీకరణకు మొగ్గు చూపడంతో ప్రధాన సూచీలు స్వల్పంగా తగ్గాయి. బీఎస్‌ఈ సెన్సెక్స్ 132 పాయింట్లు క్షీణించి 69.522 పాయింట్ల వద్ద ముగియగా, ఎన్‌ఎస్‌ఈ నిఫ్టీ 36 పాయింట్లు తగ్గి 20,901 వద్ద నిలిచింది. ప్రపంచ మార్కెట్లో క్రూడ్ ధరలు తగ్గినప్పటికీ, విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్లు(ఎఫ్‌ఐఐ) అమ్మకాల ఒత్తిడితో సెంటిమెంట్ బలహీనపడిందని విశ్లేషకులు తెలిపారు. శుక్రవారం రిజర్వ్‌బ్యాంక్ తన ద్రవ్య విధాన నిర్ణయం వెలువడనున్నందున, ట్రేడర్లు సైతం మార్కెట్‌కు దూరంగా ఉన్నారన్నారు.

### 5 లక్షల కోట్లకు ఎల్ఐసీ

కొద్దిరోజులుగా జరుగుతున్న మార్కెట్ ర్యాలీలో ప్రభుత్వ రంగ సంస్థలు పెద్ద ఎత్తున పాలుపంచుకుంటున్న నేపథ్యంలో బీమా దిగ్గజం ఎల్ఐసీ తిరిగి రూ.5 లక్షల కోట్ల మార్కెట్ విలువను చేరింది. గురువారం ఎల్ఐసీ షేరు 5 శాతానికి పైగా పెరిగి 52 వారాల గరిష్ఠస్థాయి రూ. 785 వద్ద ముగిసింది. ఇంట్రాడేలో ఇది రూ.800 స్థాయిని తాకింది. ఈ వారంలో ఎల్ఐసీ షేరు 19 శాతం ర్యాలీ జరిపింది. అయితే గతేడాది మే నెలలో జారీచేసిన ఐపీవో ధర రూ.949 స్థాయిని ఇప్పటివరకూ అందుకోలేకపోయింది.

# ఉద్యోగ కల్పనకు బ్రేక్

### మందగించిన వైట్-కాలర్ జాబ్ హైరింగ్స్

### అక్టోబర్, నవంబర్ నెలల్లో 12 శాతం తగ్గుముఖం

### నౌకరీ జాబ్‌స్పీక్ ఇండెక్స్‌లో వెల్లడి

ముంబై, డిసెంబర్ 7: వైట్-కాలర్ ఉద్యోగ నియామకాలు నెమ్మదించాయి. ఈ ఏడాది అక్టోబర్, నవంబర్ నెలల్లో నిరుడుతో పోల్చితే 12 శాతం హైరింగ్ కార్యకలాపాలు క్షీణించినట్టు గురువారం విడుదలైన నౌకరీ జాబ్‌స్పీక్ ఇండెక్స్‌లో తేలింది. ఐటీ-సాఫ్ట్‌వేర్, టెలికం, విద్యా రంగాల్లో మారిన పరిస్థితులే ఇందుకు ప్రధాన కారణమని తాజా నివేదికలో నౌకరీ.కామ్ పేర్కొన్నది. గత ఏడాది అక్టోబర్, నవంబర్ నెలల్లో వైట్-కాలర్ జాబ్ రిక్రూట్‌మెంట్లు ఆయా రంగాలవ్యాప్తంగా 2,781గా ఉన్నాయి. ఈ ఏడాది మాత్రం 2,433కే పరిమితమయ్యాయి. కాగా, నౌకరీ.కామ్ రెజ్యూమ్ డాటాబేస్‌పై వచ్చిచేరే కొత్త ఉద్యోగావకాశాలు, ఉద్యోగ సంబంధిత అన్వేషణల ఆధారంగా నెలనెలా ఈ జాబ్‌స్పీక్ సూచీ వస్తూ ఉంటుంది. ఈ ఇండెక్స్‌లో భారతీయ జాబ్ మార్కెట్, హైరింగ్ కార్యకలాపాల తీరుతెన్నులను నౌకరీ.కామ్ విశ్లేషిస్తుంది.

### టెలికం రంగంలో..

నిరుడుతో పోల్చితే ఈ అక్టోబర్, నవంబర్ నెలల్లో టెలికం రంగంలో ఉద్యోగ నియామకాలు గరిష్ఠంగా 18 శాతం పడిపోయాయి. ఆ తర్వాత విద్యా (17 శాతం), రిటైలింగ్ (11 శాతం) రంగాల్లో రిక్రూట్‌మెంట్లు దిగజారినట్టు నౌకరీ.కామ్ తెలియజేసింది. ఇక హాస్పిటాలిటీ, ట్రావెల్, ఆటో, ఆటో అనుబంధ రంగాల్లో నియామకాలు స్తబ్ధుగా ఉన్నట్టు స్పష్టం చేసింది. గతంతో పోల్చితే ఈ రంగాల్లో ఉద్యోగ నియామకాలు ఎక్కడివక్కడే ఉన్నాయన్నది.

### చమురు, గ్యాస్ రంగాల్లో..

చమురు, గ్యాస్ రంగాల్లో వైట్-కాలర్ ఉద్యోగ నియామకాలు నిరుడుతో చూస్తే ఈ ఏడాది అక్టోబర్, నవంబర్ నెలల్లో 9 శాతం పెరిగినట్టు నౌకరీ జాబ్‌స్పీక్ ఇండెక్స్ చూపింది. ఎనర్జీ కంపెనీలు పెద్ద ఎత్తున విస్తరణ బాట పట్టడం కలిసొచ్చిందని చెప్పింది. దేశవ్యాప్తంగా రిఫైనరీలను ఏర్పాటు చేస్తుండటంతో ఈ రంగంలో వైట్-కాలర్ ఉద్యోగులకు సహజంగానే డిమాండ్ ఉన్నట్టు వివరించింది. అలాగే ఔషధ రంగంలోనూ కొత్త ఉద్యోగావకాశాలు 6 శాతం పెరిగాయి. ఇక బీమా రంగంలో 5 శాతం వృద్ధి ఉన్నట్టు నౌకరీ.కామ్ చీఫ్ బిజినెస్ ఆఫీసర్ పవన్ గోయల్ తెలిపారు. కాగా, ఐటీ రంగంలో ఓవరాల్ హైరింగ్ 22 శాతం తగ్గుముఖం పట్టిందన్న ఆయన ఈ ఏడాది ప్రథమార్ధం ఆశాజనకంగా లేకున్నా.. అక్టోబర్‌తో పోల్చితే నవంబర్‌లో 1 శాతం వృద్ధి కనిపించినట్టు చెప్పారు.

### ఏఐ ఇంజినీర్లకు గిరాకీ

కృత్రిమ మేధస్సు (ఏఐ) సంబంధిత రంగాల్లో మెషిన్ లెర్నింగ్ ఇంజినీర్లు, ఫుల్ స్టక్ డాటా సైంటిస్టులకు పెద్ద ఎత్తున డిమాండ్ ఉందని, వీరికి కొత్త ఉద్యోగావకాశాలు గతంతో పోల్చితే గడిచిన రెండు నెలల్లో 64, 16 శాతం చొప్పున పెరిగాయని తాజా రిపోర్టులో వెల్లడైంది. ఇదిలావుంటే దేశంలోని మెట్రో నగరాలతో పోల్చితే నాన్-మెట్రో నగరాల్లో వైట్-కాలర్ జాబ్స్ హైరింగ్ బాగా ఉందని మరోమారు రుజువైంది. ఈ అక్టోబర్, నవంబర్ నెలల్లో వడోదరలో 9 శాతం వృద్ధి నమోదైంది. ఢిల్లీ-ఎన్‌సీఆర్, ముంబైల్లో 12 శాతం చొప్పున క్షీణత ఉన్నది. బెంగళూరు, హైదరాబాద్, చెన్నై, పుణెల్లోనూ ఇదే పరిస్థితి ఉన్నట్టు నౌకరీ.కామ్ పేర్కొన్నది. ఇక సీనియర్లకు ఉద్యోగ నియామకాల్లో కంపెనీలు అత్యంత ప్రాధాన్యతనిస్తున్నాయి. 16 ఏండ్లకుపైగా అనుభవం ఉన్నవారికి 26 శాతం అవకాశాలు పెరిగినట్టు తేలింది. ఇదే సమయంలో ఫ్రెషర్స్ నియామకాల్లో వృద్ధి 13 శాతం దిగింది.

## హైదరాబాద్ ఆఫీస్‌కు డిమాండ్

### 8 శాతం పెరిగిన అద్దె విలువలు • తాజా నివేదికలో అనరాక్ వెల్లడి

హైదరాబాద్ సిటీబ్యూరో, డిసెంబర్ 7 (నమస్తే తెలంగాణ): కమర్షియల్ ఆఫీస్ స్పేస్‌కు హాట్‌కేకులా మారిన హైదరాబాద్ నగరంలో కార్యాలయ స్థలాలకు డిమాండ్ నానాటికీ గణనీయంగా పెరుగుతున్నది. దీంతో రెంటల్ వాల్యూస్ సైతం పైపైకి పోతున్నాయి. ఈ విషయంలో దేశంలోని ప్రధాన నగరాలతో పోటీ పడుతూ హైదరాబాద్ ఆకర్షణీయ వృద్ధిని సాధిస్తోంది. గ్రేడ్-ఏ కార్యాలయ అద్దె విలువ పెరుగుదలలో దేశంలోని ఏడు ప్రధాన మెట్రో నగరాలలో హైదరాబాద్ రెండో స్థానంలో నిలిచింది. ప్రముఖ రియల్టీ సంస్థ అనరాక్ రీసెర్చ్ విడుదల చేసిన తాజా నివేదిక ప్రకారం.. హైదరాబాద్ నగరంలో గతంతో పోల్చితే 8 శాతం వృద్ధి నమోదైంది. చెన్నై 10 శాతం పెరుగుదలను నమోదు చేసి మొదటి స్థానంలో ఉండగా, ఆ తర్వాతి స్థానాల్లో హైదరాబాద్, బెంగళూరు, పుణె, కోల్‌కతా, ముంబై, ఢిల్లీ నగరాలున్నాయి. హైదరాబాద్‌లో సగటు నెలవారీ కార్యాలయ అద్దె విలువ గత ఆర్థిక సంవత్సరం (2022-23) ప్రథమార్ధం (ఏప్రిల్-సెప్టెంబర్)లో చదరపు అడుగుకు రూ.61గా ఉంటే, ఈ ఆర్థిక సంవత్సరం (2023-24) ప్రథమార్ధంలో రూ.66కి పెరిగింది. 8 శాతం వృద్ధి ఉందని అన్‌రాక్ గ్రూప్ రీజినల్ డైరెక్టర్, ప్రశాంత్ ఠాకూర్ వెల్లడించారు. ఈ క్రమంలోనే సమీప కాలంలో హైదరాబాద్.. బెంగళూరును అధిగమించనుందన్నారు.

### కో-వర్కింగ్ స్పేస్‌కు డిమాండ్..

గ్లోబల్ మార్కెట్ నుంచి సవాళ్ల ప్రభావం.. దేశంలోని అన్ని మెట్రో నగరాల కమర్షియల్ స్పేస్‌పై పడింది. ప్రతికూల ప్రభావం తాత్కాలికమే అయినప్పటికీ మెజార్టీ మెట్రో నగరాల్లో కమర్షియల్, ఐటీ ఆఫీస్ స్పేస్ లీజింగ్ గత కొంతకాలంగా తగ్గుతున్నట్టుగా తేలింది. ఈ సమయంలోనే కో-వర్కింగ్ స్పేస్‌కు అన్ని మెట్రో నగరాల్లో డిమాండ్ పెరిగిందనీ, గడిచిన ఏడాది కాలంలోనే ఐటీ రంగంలో కో-వర్కింగ్ స్పేస్ డిమాండ్ 11 శాతం వృద్ధి ఉందని అనరాక్ పేర్కొంది. కంపెనీలు మల్టీ మోడల్ వర్కింగ్ పాలసీకి జై కొడుతున్నాయన్నది.

## ఒలెక్ట్రాకు 63 కోట్ల ఆర్డర్

హైదరాబాద్, డిసెంబర్ 7: ఒలెక్ట్రా గ్రీన్‌టెక్‌కు వాసాయి-విరార్ సిటీ మున్సిపల్ కార్పొరేషన్, ముంబై నుంచి 40 ఈ-బస్సుల ఆర్డర్ లభించింది. వీటి విలువ రూ.62.80 కోట్లు. ఈ బస్సులను వచ్చే ఏడు నెలల్లో సరఫరా చేయాల్సి ఉంటుందని పేర్కొంది.

## రెడ్డీస్ హైదరాబాద్ ఆర్అండ్‌డీలో తనిఖీలు

హైదరాబాద్, డిసెంబర్ 7: డాక్టర్ రెడ్డీస్ ల్యాబోరేటరిస్ హైదరాబాద్‌లో ఉన్న పరిశోధన కేంద్రాన్ని అమెరికా నియంత్రణ మండలి తనిఖీ చేసింది. బాచుపల్లి వద్ద ఉన్న ఆర్ అండ్ డీని సందర్శించి ఎలాంటి అభ్యంతరాలు వ్యక్తం చేయలేదని పేర్కొంది.

## ఈవీలకు గిరాకీ

**గత నెలలో 1.52 లక్షల యూనిట్ల అమ్మకాలు**



న్యూఢిల్లీ, డిసెంబర్ 7: విద్యుత్‌తో నడిచే వాహనాలు కూడా టాప్‌గేర్‌లో దూసుకుపోతున్నాయి. ఇంధన ధరలు గరిష్ఠ స్థాయిలో ఉండటంతో కొనుగోలుదారులు ప్రత్యామ్నాయమైన ఈవీల వైపు మళ్లుతున్నారు. ఫలితంగా గత నెలలో దేశవ్యాప్తంగా 1,52,626 యూనిట్ల వాహనాలు అమ్ముడయ్యాయి. ఏడాది క్రితం అమ్ముడైన 1,21,596 యూనిట్ల కంటే ఇది 25.5 శాతం అధికమని ఆటోమొబైల్ డీలర్స్ అసోసియేషన్ సంఘం(ఫాడా) తాజాగా వెల్లడించింది. వీటిలో ద్విచక్ర వాహన అమ్మకాలు ఏడాది ప్రాతిపదికన 18.82 శాతం పెరిగి 91,243 యూనిట్లకు చేరడం విశేషం. క్రితం ఏడాది ఇది 76,791గా ఉన్నది. అలాగే ఈ-త్రిచక్ర వాహనాలు కూడా 32.27 శాతం ఎగబాకి 40,619 నుంచి 53,766కి చేరుకున్నట్టు ఫాడా విడుదల చేసిన నివేదికలో వెల్లడించింది. అలాగే ఎలక్ట్రిక్ ప్యాసింజర్ వాహన రిటైల్ సేల్స్ 77 శాతం అధికమై 3,983 యూనిట్ల నుంచి 7,064లకు చేరాయి. 533 యూనిట్ల ఈ-బస్సులు అమ్ముడైనట్టు పేర్కొంది.

### హెచ్‌డీఎఫ్‌సీతో టాటా జట్టు

హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్‌తో టాటా మోటర్స్ జట్టుకట్టింది. కమర్షియల్ వాహనాలను కొనుగోలు చేసేవారికి ఆర్థిక సేవలు అందించడానికి ఈ ఒప్పందం దోహదం చేయనున్నది. కస్టమర్లకు వినూత్న డిజిటల్ పరిష్కారాల ద్వారా నూతన అనుభవాన్ని కల్పించడానికి వీలు పడనున్నదని టాటా మోటర్స్ వైస్ ప్రెసిడెంట్ రాజేశ్ కౌల్ తెలిపారు.

Printed and Published by Damodar Rao Divakonda, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Published at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Telangana State. Editor: Thigulla Krishna Murthy. Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/38229.